క్లుప్తంగా

రామాలయంలో పూజలు



కూడేరు: ప్రత్యేక అలంకరణలో సీతారాములు

కూడేరు: కూడేరులోని కోదండరామాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు భాస్కర్ శర్మ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జరుపుకున్నారు. ఏఐవైఎఫ్ రాయదుర్గం అధ్యక్షుడు కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కావలి కొత్రేష్ హాజరై జెండాను ఆవిష్కరించా రు. వారు మాట్లాడుతూ యువత హక్కులు, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆవిర్భవించిందన్నారు. నాగయ్య, గంగాధర్, ప్రశాంత్, కిశోర్, రామాంజనేయులు, మల్లికార్జున పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలే

కూడేరు: చిరుప్రాయంలోనే పెళ్లి చేస్తే అనేక అనర్థాలు జరుగుతాయని, మాతాశిశు మరణాలకు అవకాశం ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. శనివారం కడదరకుంటలో చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ బాల్యంలోనే వివాహం చేస్తే గర్భంలో శిశువు ఎదుగుదల లేక నెలలు నిండకనే జన్మించడం లేదా శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్ అరుణ, మ హిళా పోలీస్ వెంకటరమణమ్మ, ఏఎస్ఎం సుశీల, అంగన్‌వాడీ వర్కర్, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ సేవలు మరువలేనివి



సన్మాన సభలో పాల్గొన్న ఎంపీపీ మారుతమ్మ

కళ్యాణదుర్గం రూరల్: ఎంపీడీఓ రామచంద్ర సేవలు మరలేవని ఎంపీపీ మారుతమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ అయిన కళ్యాణదుర్గం ఎంపీడీఓ రామచంద్ర దంపతులను సన్మానించారు. ఎంపీపీ మారుతమ్మ మట్లాడుతూ మండల అభివృద్ధిలో కోసం మీరు చేసిన సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆంజనేయులు, మల్లి, సచివాలయ సిబ్బంది, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన సర్పంచు

వజ్రకరూరు: మదనపల్లిలోని హార్సిలీహిల్స్‌లో స్థానిక స్వపరిపాలన- సామర్థ్యాల పెంపు అంశాలపై ఏర్పాటు చేసిన శిక్షణకు సర్పంచు మోనాలిసా శనివారం హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు హాజరై వివిధ అంశాలపై సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. పంచాయతీలోని సహజ వనరులను ఏవిధంగా కాపాడుకోవాలి., తాగునీటి సమస్య ఎలా పరిష్కరించాలి? తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం తాగునీటి సమస్య ఎలా పరిష్కరించాలి- తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై సర్పంచు మోనాలిసా వివరించారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



శ్రీవారి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకీ ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామిని పల్లకీలో ఉంచి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు.

పడిగాపులు



తహసీల్దార్ కార్యాలయం ముందు అధికారుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

కూడేరు: కూడేరు తహసీల్దార్ కార్యాలయానికి శనివారం వివిధ పనుల నిమిత్తం ప్రజలు తరలి వచ్చారు. 12 గంటలు దాటినా అధికారులు విధులకు హాజరు కాలేదు. అధికారులు వస్తారా? రారా? అని సమాచామిరం ఇచ్చే అటెండర్ కూడా తీరిగ్గా 12 గంటలకు హాజరయ్యాడు. పి.నారాయణపురం, కరుట్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు బ్యాంకుల్లో రెన్యూవల్ కోసం అడంగల్‌లో తహసీల్దార్ సంతకాల కోసం ఉదయం 10 గంటల నుంచి పడిగాపులు కాయాల్సి వచ్చింది.

వర్షాకాలం.. దినదిన గండం

- 'దుర్గం'లో వానొస్తే లోతట్టు ప్రాంతాల్లోకి నీరు
- నీటి కాలువలపై తొలగని ఆక్రమణలు
- పట్టణంలోని పలు కాలనీలకు ముంపు భయం
- మేఘాలు కమ్ముకుంటే ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్న జనం
- ప్రత్యామ్నాయ మార్గం చూపని యంత్రాంగం



రామస్వామివీధిలోకి వరదనీరు చేరడంతో పరిస్థితి ఇలా..



నీటిలో మునిగిపోయిన రామస్వామివీధి

రాయదుర్గం: 'దుర్గం'.. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం. అందునా కర్ణాటకకు సరిహద్దు నియోజకవర్గ కేంద్రం. అందునా ఎంతో మంది కార్మికులు, పేదలు జీవిస్తున్న ప్రాంతం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలపై ఆక్రమణలతో వానాకాలంలో పరిస్థితి దిన దిన గండమే అన్నట్లుంది. ఇరుకు వీధుల్లోకి వరద నీరు పారుతుంది. ఇళ్లలోకి, వ్యాపార సముదాయాల్లోకి చేరుతుంది. దీనికితోడు అనంతపురం, కణేకల్లు ప్రధాన రోడ్లపైన ట్రాఫిక్ కష్టాలు వస్తాయి. పట్టణ వాసులను సమస్య వెంటాడుతున్నా.. పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారుల్లో చిత్తశుద్ధి కరవైంది. పట్టణంలోని 32 వార్డులు, 75 వేల జనాభా ఉంది. 18 వార్డు సచివాలయాల పరిధిలో 100 కిలోమీటర్ల డ్రైనేజీలు నిర్మించారు. ఇందులో కొన్ని చెత్తతో నిండుకోగా, మరిన్ని పిల్లకాలువల్లా నిత్యం ప్రవహిస్తుంటాయి. చినుకు పడితే చాలు బళ్లారి రోడ్డు పైభాగనున్న కొండ ప్రాంతాలు, శాంతినగర్, నీలకంఠేశ్వరస్వామి, బళ్లారి బస్టాండ్, వినాయక సర్కిల్, మార్కెట్ ఏరియా, ఓబుళాచారి రోడ్డు మీదుగా వచ్చే వాన నీళ్లు దిగువకు పరుగులు తీస్తాయి. దీంతో దాసప్పరోడ్డు, కొలిమి వీధి, రామస్వామి వీధి, దుగ్గిలమ్మ గుడి, మధుటాకీస్ ఏరియాలోని వందలాది ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకుని నిద్రాహారాలు మానాల్సి వస్తోంది.



వర్షం వస్తే కొలిమివీధిలో ఇలా (ఫైల్)

మేఘాలు కమ్ముకున్నాయంటే..

ఇటీవల అకాల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు కాలనీవాసుల్లో వణుకు మొదలైంది. మేఘాలు కమ్ముకున్నాయంటే చాలా ప్రాంతాల్లో ఇళ్లలోని వస్తువులన్నీ ఎత్తైన ప్రాంతాలకు చేర్చి తాళాలు వేసుకొని గుడి,బడిలో తలదాచుకోవాల్సి వస్తోంది. ఈ కన్నీటి కష్టాలు ఇంకెన్నాళ్లంటాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార సముదాయాల్లో కూడా వరదనీరు చేరుతుండడంతో యజమానులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. గతంలో భారీ వర్షాలు కురవడంతో రూ.కోట్లలోనే నష్టపోవాల్సి వచ్చింది. దీంతో చినుకు పడితేచాలు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ప్రధాన సమస్యకు శాశ్వత సమస్యకు పరిష్కారం చూపాలని వందలాది కుటుంబాలు కోరుతున్నాయి.



వరదనీటిని పారబోస్తున్న దృశ్యం (ఫైల్)

అక్రమ కట్టడాలు తొలగితేనే..

పట్టణంలోని ప్రధాన కాలువలపై ఇష్టారాజ్యంగా అక్రమ కట్టడాలు వెలిశాయి. వీటిని అరికట్టడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో డ్రైనేజీలన్నీ ఎక్కడబడితే అక్కడ కుంచించుకుపోయాయి. ఫలితంగా మురుగు నీరుతోపాటు వర్షపునీరు కలిసి వరదలా ఉప్పొంగుతాయి. అక్కడి నుంచి దిగువకాలనీల్లోకి చొచ్చుకొస్తున్నాయి. కాలువలు వెడల్పు చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తోందని మేధావులు, ఇంజనీరింగ్ నిపుణులు చెప్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.20 కోట్లు కేటాయింపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాయదుర్గంలోని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అడుగులు పడ్డాయి. స్థానిక మున్సిపల్ పాలకవర్గం కౌన్సిల్ సమావేశాల్లో పలుమార్లు తీర్మానాలు చేసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సత్వరం స్పందించి రూ.20 కోట్ల నిధులు కేటాయిస్తూ జీవో విడుదల చేశారు. డీపీఆర్ తయారు చేసి సకాలంలో పనులు పూర్తి చేసేలా కార్యాచరణ ప్రారంభించారు. అంతలోనే సాధారణ ఎన్నికలు రావడం.. ఆతర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటుకావడంతో సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

రూ.50 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం



రాయదుర్గంలోని ముంపు కాలనీవాసులకు శాశ్వత పరిష్కార మార్గం చూపేలా చర్యలు చేపట్టాం. ఇటీవల నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. దీంతో రూ.50 కోట్ల నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. ఇందులో రూ.20 కోట్లతో డ్రైనేజీలు, రూ.30 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టేలా డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నాం. త్వరలో పనులు ప్రారంభించి, ప్రజలకు ఇబ్బందులు తొలగించేలా కృషి చేస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

కూడేరు పీహెచ్‌సీకి డాక్టర్ నియామకం



మరుట్లలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఉషారాణి

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: కూడేరు ప్రభుత్వాస్పత్రికి ఉన్నతాధికారులు మరో వైద్యురాలిని శనివారం నియమించారు. 'సాక్షి'లో 'వైద్యం అందక అవస్థలు' శీర్షికన మార్చి 31న, ఈనె 2న వరుసగా వార్తలు ప్రచురితమయ్యాయి. కూడేరు మండలానికి ఉషారాణిని డాక్టర్‌గా నియమించారు. శనివారం ఆమె బాధ్యతలు చేపట్టారు. పెద్దపప్పూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. పీహెచ్‌సీ సిబ్బంది ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. తర్వాత మరుట్ల-2వ కాలనీలో 104 వాహనం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించారు.

వేతనాలు ఎప్పుడిస్తారో చెప్పండి



సమస్యలపై ప్రస్తావిస్తున్న కోఆప్షన్ సభ్యుడు దిలవర్ బాషా

రాయదుర్గం: ఎంపీపీ, ఎంపీటీసీలకు ప్రతినెలా ఇవ్వాల్సిన గౌరవ వేతనం 16 నెలలుగా పెండింగ్‌లో ఉందని, ఆ మొత్తం ఎప్పుడిస్తారో చెప్పాలని మండల కోఆప్షన్ సభ్యుడు దిలవర్ బాషా నిలదీశారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ కురుబ అరుణ్‌కుమార్‌తో పాటు ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ నాగరాజు హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే ఆయా శాఖల పురోగతిని మండల అధికారులు వివరించారు. అనంతరం కోఆప్షన్ సభ్యుడు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంపీపీ, ఎంపీటీసీలు కృషి చేస్తున్నామన్నారు. 10 నెలల కాలంలో స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయక అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. ఎంపీపీకి రూ.6 వేలు, ఎంపీటీసీలకు రూ.3 వేల గౌరవ వేతనాలు పొరుగు మండలాల్లో ఇచ్చినా ఇక్కడ జాప్యమెందుకు చేస్తున్నారని నిలదీశారు. ఆయాశాఖల మండల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోలీసుల నాకాబందీ

ఉరవకొండ రూరల్: మండల పరిధిలోని నెరిమెట్లలో పోలీసులు శనివారం నాకాబందీ నిర్వహించారు. ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు అనుమానిత ప్రదేశాలు, అనుమానితుల ఇళ్లలో తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఐక్యంగా ఉంటూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

పరిమితికి మించి తరలిస్తే చర్యలు

ఉరవకొండ: పరిమితికి మంచి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని ఆటో డ్రైవర్లకు ఉరవకొండ ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. మండల పరిధిలోని నెరిమెట్ల గ్రామంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు అన్ని రకాల రికార్డ్స్ అప్‌డేట్ చేయించుకొని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు.

కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం.. ఆర్డీటీని పరిరక్షిద్దాం

- సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య



మాట్లాడుతున్న సమన్వయకర్త తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఆర్డీటీని పరిరక్షించుకుందామని పీఏసీ సభ్యులు, సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామితో కలిసి ఐదు మండలాల కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి అధ్యక్షులతో సమావేశమయ్యారు. రంగయ్య మాట్లాడుతూ ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని కేంద్రంపై ఒత్తిడికి వైఎస్సార్‌సీపీ కృషి చేస్తోందన్నా రు. మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్, మున్సిపల్ విభాగం కన్వీనర్ సుధీర్, వివిధ మండలాల కన్వీనర్లు గోళ్ల సూరి, పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎస్ హనుమంతరాయుడు, వడ్డే వెంకటప్ప, కె.హనుమంతరాయుడు, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, వివిధ విభాగాల అధ్యక్షులు హనుమంతరెడ్డి, ఎర్రిస్వామి, పాతలింగ, రామిరెడ్డి, పాండు, శ్రీకాంత్, బేరీల రాజు, మల్లి, రామాంజనేయులు, ఇబ్రహీం, కిరీటి యాదవ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి నివాళి

బ్రహ్మసముద్రం : పోలేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కేఎల్ మహాత్మారెడ్డి తండ్రి లక్కప్ప ఆకస్మి కంగా మృతిచెందాడు. నియోజకవర్గ వైఎస్ఆర్ సీ పీ నాయకులు మాదినేని ఉమామహేశ్వర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వా మి, జిల్లా ఉపాధ్యక్షుడు కోనాపురం గంగాధర తదితరులు లక్కప్ప మృతదేహం వద్ద నివాళులర్పించారు. జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తలారి సత్తి , మండల కన్వీనర్ పాల బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ శెట్టిగారి మంజునాథ, మాజీ ఎంపీపీ మహదేవప్ప, మాజీ మండల కన్వీనర్ బసవరాజు, నాయకులు ఎరడికెర ఎర్రిస్వామి, మాజీ ఎంపీటీసీ లోకేష్, చెలిమేపల్లి ఆంజనేయు లు, శరణప్ప, ఆర్ఎంపీ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



వై.విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న గోవిందునాయక్

వజ్రకరూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డిని నూతనంగా నియమితులైన వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్తియా గోవింద్‌నాయక్ సన్మానించారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వి శ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని గ్రామ స్థాయిలో పటిష్ఠం చేయాలని సూచించారు.

పీఏసీఎస్ మాజీ చైర్మన్‌కు పరామర్శ

వజ్రకరూరు: మండలానికి చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుధీర్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఫోన్‌లో శనివారం పరామర్శించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుధీర్‌రెడ్డి అనారోగ్యంతో ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి



సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డికి శాలువా కప్పి సత్కరిస్తున్న నాయకులు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం సమష్టిగా పని చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నేతలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నేతలు శనివారం రాత్రి మెట్టు స్వగృహంలో కలిసి, సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మెట్టు మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారిని గుర్తించి వివిధ విభాగాల్లో కీలక పదవుల్లో నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వేమన, కృష్టారెడ్డి, రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఆర్కే బద్రీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం కార్యదర్శి కెంగుట రామిరెడ్డి, ఎంపీటీసీ గోపాల్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, నాయకులు ఆంజనేయులు, తిమ్మప్ప, లాలుస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు బచ్చనకల్లేశ్వరస్వామి పట్టాభిషేకం

కణేకల్లు: కురుబల (తెల్లతుమ్మలగోత్రం) ఇంటి ఇలవేల్పు బచ్చనకల్లేశ్వరస్వామి పట్టాభిషేక మహోత్సవం ఆదివారం జరగనుంది. 25 ఏళ్లకోసారి నిర్వహించనున్న ఈ వేడుకలను ఈఏడాది వైభవంగా జరపడానికి ఆలయ కమిటీతోపాటు కురుబలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆంధ్రా, కర్ణాటక నుంచి సుమారు వంద గ్రామాల్లో ఉంటున్న తెల్ల తుమ్మలగోత్రం వారు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. సుమారు 80 వేల నుంచి 90వేల వరకు జనం తరలి రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అతి పురాతన స్వామి ఆలయాన్ని కురుబలు రూ.3 కోట్లతో నిర్మించారు. శనివారం బచ్చనకల్లేశ్వరస్వామి, వసికేరప్ప స్వామికి పూజలు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

రాయితీతో పశుదాణా సరఫరా

రాయదుర్గంటౌన్:రాయితీతో పశువులకు నాణ్యమైన సమీకృత దాణాను సరఫరా చేస్తున్నట్లు పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. అవసరమైన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లోగానీ పశువైద్యాధికారిని కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. రాయితీ పశుదాణా పంపిణీకి రాయదుర్గం మండలానికి 25 టన్నుల పశుదాణాను కేటాయించినట్లు తెలిపారు. 50 కేజీల దాణా పూర్తి ధర రూ.1110 కాగా, 50 శాతం సబ్సిడీతో రైతు వాటా రూ.555 ఉందన్నారు.

గుమ్మఘట్ట: 50 శాతం సబ్సిడీతో పశువులకు త్వరలోనే దాణా సరఫరా చేయనున్నట్లు పశువైద్యులు నవీన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 50 కేజీల పూర్తి ధర రూ.1,150 కాగా, రైతు వాటా కింద రూ.588 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేడు ఉచిత సున్నీ కార్యక్రమం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జామియా అన్వారుల్ ఉలుమ్ మదరసాలో అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 4న పేద కుటుంబాల పిల్లలకు ఉచిత సున్నీ (వడుగులు) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఆధార్ క్యాంపు సద్వినియోగం చేసుకోండి

శెట్టూరు:మండలంలో ఈ నెల 5 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5, 6 తేదీల్లో ఐదుకల్లు, 7,8న చిన్నంపల్లి, 12, 13న బచ్చేహళ్లి, 14,15న చింతర్లపల్లి గ్రామాల్లోని సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 0 నుంచి 6 ఏళ్ల పిల్లలకు కొత్త ఆధార్ నమోదు, 5 నుంచి 15 లోపు పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ సర్వీసులు చేయనున్నట్లు తెలిపారు.

కార్మికుల సమ్మెకు ఎంఈఎఫ్ మద్దతు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల సమ్మె శనివారంతో 28వ రోజుకు చేరుకుంది. శ్రీరామరెడ్డి కార్మికులు పంప్ హౌస్ వద్ద నిర్వహిస్తున్న సమ్మెకు ఎంఈఎఫ్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మన్న, వార్డెన్ నాగరాజు, కోశాధికారి మహేష్, తాలూకా నాయకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ఉరవకొండ: స్థానిక గవిమఠం ప్రాంగణంలో వైఎస్సార్ జిల్లా (కడప) పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో శనివారం జరిగిన మెగా కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది.ఈ శిబిరానికి 200 మంది కంటి పరీక్షలకు హాజరయ్యారు. సీనియర్ కంటి వైద్య నిపుణులు కళ్యాల చిన్న మల్లప్ప ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. అనంతరం 65 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. రేణుమాకుపల్లి మాజీ సర్పంచ్ కళ్యాల వీరభద్రప్ప, కళ్యాల యశ్వంత్ పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

రాయదుర్గంటౌన్: అనంతపురం ప్రధాన రహదారి గుండ్లపల్లి బ్రిడ్జి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోనబావికి చెదిన అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్సనిమిత్తం రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రేపు ఏపీటీఎఫ్ ధర్నా

రాయదుర్గంటౌన్: ఈ నెల 5న నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నా, 9న జిల్లా కేంద్రంలోని కలెక్టర్ వద్ద ధర్నా, 14న విజయవాడలో ధర్నా చౌక్‌లో రాష్ట్ర స్థాయి ధర్నాలు చేస్తున్నట్లు ఏపీటీఎఫ్‌జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఇందిరాగాంధీ యూపీ స్కూల్‌లో ఏపీటీఎఫ్ కార్యవర్గం సమావేశం నిర్వహించి, రాష్ట్ర కమిటీ ప్రకటించి ఉద్యమ కార్యచరణను వివరించారు. ఏపీటీఎఫ్ నాయకులు పాండు, సిద్దేశ్వర, రామాంజనేయులు, మల్లికార్జున, సునీ ల్,అనిల్‌కుమార్, ఖాసీం, రజాక్ పాల్గొన్నారు.

ఉగ్రదాడులకు నిరసనగా ర్యాలీ

బొమ్మనహళ్:పెహల్గాం ఉగ్రదాడులను ఖండిస్తూ మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీలర్ శివ, రాజేష్, స్థానికులు బాబురెడ్డి, శివరుద్ర, భీమన్న, తిప్పయ్య, శివ, అశోక్ పాల్గొన్నారు.


శనీశ్వరస్వామికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్:పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగసింగ్ కాలనీలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.



విమానయాన విహారయాత్ర మధురానుభూతి

- ఎంఈఓ మల్లారెడ్డికి కృతజ్ఞతలు విద్యార్థినులు



తెలంగాణ సెక్రటరీయేట్ వద్ద ఎంఈఓ మల్లారెడ్డితో కలసి గ్రూపు ఫొటో దిగిన విద్యార్థినులు

బొమ్మనహళ్: విమాన విహార యాత్ర మధురానుభూతిని మిగిల్చిందని విద్యార్థినులు తెలిపారు.తమకు విమానయాన విహారయాత్ర అవకాశం కల్పించిన ఎంఈఓ మల్లారెడ్డికి విద్యార్థినులు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో పదో తరగతి ఫలితాల్లో టీ.ఇందు 585, వై.ఈశ్వరి 574, టీ.మధుశ్రీ 568, సి.లావణ్య 560, కె.అర్చన 556 మార్కులు సాధించి మండల టాపర్స్‌గా మొదటి ఐదు స్థానాల్లో నిలిచారు. ఫలితాల్లో ప్రతిభచూపిన విద్యార్థినులను ఎంఈఓ మల్లారెడ్డి విమానయాన విహారయాత్రకు తీసుకెళ్లారు. శుక్రవారం బెంగళూరు నుంచి విమానంలో హైదరాబాద్‌కు వెళ్లి పలు చారిత్రాత్మక, సందర్శన ప్రాంతాలను చూపించి, శనివారం విద్యార్థినులు సొంతూళ్లకు చేరుకున్నారు. హైదరాబాద్‌లో చార్మినార్, రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్ట్, ఎన్‌టీఆర్ గార్డెన్, సాలార్‌జంగ్ మ్యూజియం, తెలంగాణ సెక్రటేరియట్, జుమ్మా మసీద్ తదితర ప్రాంతాలను చూపించారు.

విరేచనాలతో మహిళ మృతి

- వైద్యం వికటించి మృతిచెందినట్లు బాధితుల ఆరోపణ

గుమ్మఘట్ట: మండలంలోని జాలివంకకు చెందిన బోయ పార్వతమ్మ (53) విరేచనాలతో శనివారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు.. పార్వతమ్మ, రాయదుర్గంలోని పైతోటకు చెందిన ఈరబొమ్మన్న దంపతులకు సంతానం కలగలేదు. ఈరబొమ్మన్న రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య పార్వతమ్మ పుట్టింటికి వెళ్లింది. రెండు రోజులుగా వాంతులు, విరేచనాలు అవుతుండడంతో ఆర్ఎంపీ (మూస క్లినిక్) ఖలీల్ వద్దకు చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. చికిత్స తర్వాత ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే ఆమె మృతి చెందడంతో వైద్యం వికటించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా మార్చి నెలలో గలగల గ్రామానికి చెందిన లక్ష్మీ కూడా ఆర్ఎంపీ ఖలీల్ వద్దకు చికిత్స చేయించిన తర్వాతనే మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై విచారించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆర్ఎంపీపై చర్యలు తీసుకున్నారు. క్లినిక్‌ను సీజ్ చేశారు. అయితే నెల రోజులు కూడా గడవకనే వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలను ఖాతరు చేస్తూ క్లినిక్ వైనుక భాగంలో గుట్టుగా తెరిచి వైద్యసేవలు అందిస్తున్నారు.